క్లుప్తంగా

ఆలయాల్లో ఇరుముడుల సందడి



ఏలేశ్వరంలో ఇరుముడులు స్వీకరిస్తున్న సత్యస్వాములు

ఏలేశ్వరం: పట్టణంలోని పలు ఆలయాల్లో సోమవారం అయ్యప్ప మాలధారులు, సత్యస్వాములు ఇరుముడులు స్వీకరించారు. దీక్షా సమయం ముగియడంతో స్థానిక శివాలయంలోని అయ్యప్పస్వామి ఉపాలయంలో అయ్యప్పభక్తులు ఇరుముడులు కట్టుకున్నారు. అయ్యప్పమాలధారుల బంధువులు, స్నేహితులతో ఆలయంలో సందడి నెలకొంది. అయ్యప్పస్వాములు ప్రత్యేక వాహనాలు, ట్రైన్లల్లో శబరిమలైకు పయనమయ్యారు. సత్యదీక్ష ముగియడంతో స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో అర్చకుడు పొన్నూరు సత్యనారాయణచార్యులు ఆధ్వర్యంలో సుమారు 50 మంది సత్యస్వాములు ఇరుముడులు స్వీకరించారు. ఆలయం నుంచి అన్నవరం సత్యనారాయణస్వామి వారి ఆలయానికి ఇరుముడులతో పయనమయ్యారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కావిడి మహోత్సవం



కత్తిపూడిలో కలశాలతో స్వామివారి ఊరేగింపు

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో పంతం వారి మెట్టపై వేంచేసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కావడి మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం 108 కలశాలతో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కేలంగి నూకరాజు, జీలకర్ర లక్ష్మణరావు, మాదేపల్లి మహేష్, మల్లిసాం బాబులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం



పాలెంలో పార్టీ జెండాను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ తోట రవి అన్నారు. మండలంలోని పాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు అడబాల కొండబాబు అధ్యక్షతన సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత ప్రధాన రహదారి సెంటర్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడూ పాఠశాలలకు సెలవు

ప్రత్తిపాడు: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో ప్రత్తిపాడు మండలంలోని పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు. జిల్లా విద్యాశాఖాధికారి సూచన మేరకు రెండో రోజు మంగళవారం కూడా మండలంలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించినట్టు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు.

కార్తిక వనసమారాధన

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం కోల్డ్ స్టోరేజ్ వెనుక మామిడి తోటలో సోమవారం కాపు కార్తిక వనసమారాధన నిర్వహించారు. తొలుత మహిళలు ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ధర్మవరం, వెల్దుర్తి తదితర గ్రామాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల తాకిడితో మామిడి తోట ప్రాంగాణం కిటకిటలాడింది. సుమారు ఆరు వేల మంది భక్తులు పాల్గొని ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు.

భారీ అన్నదానం

శంఖవరం: స్థానిక పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద సోమవారం అన్నదానం నిర్వహించారు. తొలుత పండితులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భజన బృందాల సభ్యులు భజనలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించగా స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు కోరుకొండ నూకరాజు, యండమూరి నాగలక్ష్మి, బ్రాహ్మణి, బోస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



యర్రవరంలో రైతులకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్ చిన్నారావు, ఏవో జ్యోతి



ప్రత్తిపాడులో పొలాలను పరిశీలించి రైతులను అప్రమత్తం చేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ



పెద్దిపాలెంలో నేలకొరిగిన వరి పంట



తంటికొండలో ధాన్యాన్ని రైసు మిల్లుకు తరలిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది



భద్రవరంలో వర్షాలకు నేలకొరిగిన వరిచేలు

వాన జోరు.. అన్నదాత బేజారు

- మిచాంగ్ తుపాను ప్రభావంతో విస్తారంగా వర్షాలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలిస్తున్న అధికారులు



జగన్నాథపురంలో పనలపై తడిసిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఏలేశ్వరం: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం విస్తారంగా వర్షాలు కురిశాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ ఎడతెరిపి వర్షం కురుస్తూనే ఉంది. పల్లపు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. ముందస్తుగా తుపాన్‌పై రైతులను వ్యవసాయశాఖ అధికారులు అప్రమత్తం చేశారు. వరిపంటకు దాదాపుగా నష్టం తప్పింది. వారం రోజుల నుంచి రైతుల వద్దకు వెళ్లి వరికోతలు ఆపాలని, కోసిన పనలు వెంటనే నూర్పులు చేపట్టాలని అధికారులు సూచించారు. అధిక శాతం మంది రైతులు సకాలంలో పంటను ఒబ్బిడి చేసుకున్నారు. మండలంలో సుమారు 5,200 ఎకరాల్లో వరిపంట వేయగా దాదాపుగా 60 శాతం కోతలు పూర్తయ్యాయి. పలు గ్రామాల్లో కోసిన పంట పనలపై ఉండగా రైతులు ఆదరాబాదరాగా ఒబ్బిడి చేశారు. మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి, తహసీల్దార్ చిన్నారావు యర్రవరం, ఏలేశ్వరం, లింగంపర్తి, భద్రవరం తదితర గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాలకు పంటలు నష్టపోకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు సూచించారు. వారి వెంట సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

కోటనందూరు: మండలంలోని ఇండుగపల్లి, కాకరాపల్లి, జగన్నాథపురం, అల్లిపూడి తదితర గ్రామాల్లో సోమవారం తుని సబ్‌డివిజన్ వ్యవసాయ సహాయకులు సుంకర బుల్లిబాబు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ, తహసీల్దార్ కుశరాజు, ఏఓ కేజే చంద్రశేఖర్ పర్యటించారు. పనలపై ఉన్న పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ కేవీ శివకుమారి, వీఏఏలు పాల్గొన్నారు.

నేలవాలిన వరిసాగు

రౌతులపూడి: మండల వ్యాప్తంగా సోమవారం కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో వరి చేలు నేలకొరిగాయి. ఈ ఏడాది మండల వ్యాప్తంగా సుమారు 3500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. మండలంలోని గుమ్మరేగుల, ఎస్.పైడిపాల, రాఘవపట్నం, ఎన్.పట్నం, బలరామపురం, ఎ.మల్లవరం తదితర గ్రామాల్లోని వరి చేలను వ్యవయాధికారులు పరిశీలించారు. రైతులతో మాట్లాడి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సుమారు 200 ఎకరాలకు పైగా వరిపంట నేలకొరిగినట్లు మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు తెలిపారు.

పల్లపు ప్రాంతాలు జలమయం

తుని: మిచాంగ్ తుపాను ప్రభావంతో పట్టణంలోని సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. వర్షంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పట్టణంలోని కొండవారిపేట రైల్వే అండర్ పాసులోకి నీరు చేరడంతో రైల్వే ట్రాక్‌కు అవతల ఉన్న పది వార్డులకు చెందిన ప్రజల రాక పోకలకు అంతరాయం కలిగింది. పట్టణంలో నీరు నిలిపోయిన ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నీరు కాలువలోకి పోయేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఎడతెరిపి లేకుండా వాన

ప్రత్తిపాడు: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో సోమవారం తెల్లవారుజాము నుంచే చిన్న చిన్న తుంపర్లుగా వాన ప్రారంభమైంది. మధాహ్నం సమయానికి జోరు పెరిగిన వాన రాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ హెచ్చరికల నేపథ్యంలో వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతాంగం పంట ఒబ్బిడి చేసుకోవడంతో పంట నష్టం లేదనే చెప్పవచ్చు. పనలపై ఉన్న పంటను రైతులు ఆఘమేఘాల మీద కుప్పలుగా వేశారు. కోత దశలో ఉన్న పంటను కోయవద్దంటూ అధికారులు సూచనలు చేయడంతో ప్రత్తిపాడు, ఒమ్మంగి, ధర్మవరం తదితర గ్రామాల్లో ఖరీఫ్ కోతలు చేపట్టలేదు. వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రత్తిపాడులో 17.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రత్తిపాడులో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై నిలిచిపోయింది. అల్లూరి సీతారామరాజు జంక్షన్, అంబేడ్కర్ కళా మందిర్ వద్ద రోడ్డుపై వర్షపు నీరు తిష్ట వేసింది.

పంట పొలాల పరిశీలన

మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో ప్రత్తిపాడు, ధర్మవరం, రాచపల్లి గ్రామాల్లోని పంట పొలాలను సోమవారం తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ పరిశీలించారు. తుపాన్ పట్ల రైతులను అప్రమత్తం చేశారు. ప్రసుతం పంటకు నష్టం లేదన్నారు. పంట కోతలు, నూర్పిడులు వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు. ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లోని రైసు మిల్లర్లకు తరలించుకోవాలన్నారు. విపత్కర పరిస్థితులు ఏర్పడితే ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 08868 246210 నంబర్‌కు సమాచారం అందించాలని తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ కోరారు.

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా సోమవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వర్షం ప్రభావంతో ప్రజలు ఇంటి నుంచి అడుగు బయట పెట్టలేని పరిస్థితి నెలకొంది. అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు పనలపై, కళ్లాల్లో ఉన్న వరి పంటను ఒబ్బిడి చేసుకున్నారు. ఈదురుగాలులకు కోత దశకు చేరుకున్న వరి పంట నేలకొరింది. మండలంలో 17.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై ఏర్పడిన గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. మండలంలోని ప్రత్తిపాడు, రాచపల్లి, ధర్మవరం గ్రామంలోని పంట పొలాలను తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ పరిశీలించారు.

పంట ఒబ్బిడిలో బిజీబిజీ

కిర్లంపూడి: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రైతులు పంటలను ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలో 10 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇప్పటికే 7500 ఎకరాల్లో పంటను ఒబ్బిడి చేసుకోగా 200 ఎకరాల్లో వరి పనలపై ఉంది. మరో 80 క్వింటాళ్ల ధాన్యం రాసులు కళ్లాలోనే ఉన్నాయి. కాగా సోమవారం ఆర్డీవో జె.సీతారామారావు, ఏఓ జోకా అమృత, తహసీల్దార్ కేవీ మాధవరావు తన సిబ్బందితో కలిసి కళ్లల్లో ఉన్న ధాన్యం రాశులను పరిశీలించారు. ధాన్యాన్ని ట్రాక్టర్లకు లోడ్ చేయించి రైసు మిల్లులకు తరలించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని తరుగు లేకుండా రైస్ మిల్లులకు తరలిస్తున్నట్టు తెలిపారు.

ఎడతెరిపి లేని వాన

గోకవరం: మండలంలో సోమవారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. తుపాను కారణంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో మండలస్థాయి అధికారులు కార్యాలయాల్లో ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. మండలంలో వరి పంట ఇప్పటికే కోతలు దాదాపు పూర్తికావడంతో కళ్లాల్లోనే ధాన్యం ఉండిపోయింది. ధాన్యం తడిచిపోకుండా రైతులు బరకాలు కప్పి ఉంచారు. ఈ ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభించారు. తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఆదేశాలు జారీ చేశారు. మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ పద్మావతి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. ఏఓ రాజేశ్వరి ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ సిబ్బంది కళ్లాల్లోని ధాన్యాన్ని తరలించేందుకు చర్యలు చేపట్టారు.

3735 ఎకరాల్లో వరికోతలు పూర్తి

తుని రూరల్: మిచాంగ్ తుపాన్ ప్రభావంపై రైతులను వారం రోజుల నుంచి అప్రమత్తం చేస్తున్నామని వ్యవసాయశాఖ తుని సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు తెలిపారు. తుని వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆలయ మాట్లాడుతూ సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 3735 ఎకరాల్లో వరికోతల పూర్తయ్యాయన్నారు. వరికోతలు పూర్తి చేసిన రైతుల నుంచి ఆన్‌లైన్ ద్వారా 2207 మెట్రిక్ టన్నులు, ఆఫ్‌లైన్ ద్వారా 50 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేశామన్నారు. మరో 5960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు నేరుగా బహిరంగ మార్కెట్లో విక్రయించుకున్నట్టు ఏడీఏ తెలిపారు. 2207 మెట్రిక్ టన్నుల ధాన్యం కుప్పలపై ఉందని, కల్లాల్లో 1099 మెట్రిక్ టన్నుల ధాన్యంపై టార్పాలిన్లు కప్పినట్టు ఆయన వివరించారు. తుని మండలంలో 55 ఎకరాలు, తొండంగి మండలంలో 2698 ఎకరాలు, కోటనందూరు మండలంలో 540 ఎకరాలు, రౌతులపూడి మండలంలో 147 ఎకరాలు, శంఖవరం మండలంలో 295 ఎకరాల్లో కోతలు పూర్తయినట్టు ఏడీఏ బుల్లిబాబు పేర్కొన్నారు. విస్తారంగా వర్షం కురుస్తున్నా ఈదురు గాలులు లేకపోవడంతో నష్టం వాటిల్లే ప్రమాదం స్వల్పమే అన్నారు. మరో రెండు మూడు రోజులు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తే ఖరీఫ్ పైర్లకు నష్టం వాటిల్లుతుందన్నారు. ముందు నుంచి హెచ్చరికలు జారీ చేయడంతో పత్తిసాగుదారులు పత్తి సేకరణ పూర్తి చేశారని, అక్కడక్కడ కొంతమేరకు తడిసే అవకాశం ఉందన్నారు.



ఎ.కొత్తపల్లిలో టార్పాలిన్లతో ధాన్యాన్ని కప్పిన రైతులు

తీరంలో అలజడి

తొండంగి: మిచాంగ్ తుపాను ప్రభావంతో మండలంలోని సముద్ర తీరాల్లో అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. అద్దరిపేట నుంచి కొత్తపోడిపల్లిపేట వరకూ తీరంలోని మత్స్యకార గ్రామాలను తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్.ఉమామహేశ్వరరావు, మత్స్యశాఖ సిబ్బందితో కలిసి పరిశీలించారు. తుపానుపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, తుపాను ప్రభావం తగ్గే వరకూ అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌డీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. మత్స్యకారులు తీరంలో లంగరు వేసిన బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు.తుపాను ప్రభావంతో వీస్తున్న ఈదురగాలులకు మండలంలోని పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.



కొత్తచోడిపల్లిపేట సముద్ర తీరంలో బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించుకుంటున్న మత్స్యకారులు

300 టన్నుల ధాన్యం మిల్లులకు తరలింపు

జగ్గంపేట: తుపాన్ నేపథ్యంలో కళ్లాలో ధాన్యాన్ని ప్రభుత్వ హెచ్చరికలతో అధికారులు రైసు మిల్లులకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకు 300 టన్నుల ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించినట్లు అధికారులు తెలిపారు. మరో 600 టన్నుల ధాన్యం ఇంకా కళ్లాల్లోనే ఉంది. మండలంలోని కాట్రావులపల్లి, రామవరం గ్రామాల్లో సోమవారం తహసీల్దార్ శ్రీదేవి, వ్యవసాయ అధికారి శ్రీరామ్ పర్యటించి రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

512 ఎకరాల్లో తడిసిన వరిపంట

తొండంగి: తుపాను ప్రభావంతో మండల వ్యాప్తంగా సోమవారం తెల్లవారుజాము నుంచి ఈదురగాలులతో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వందాలాది ఎకరాల్లో వరిపంట పనలపై తడవగా కోతకు వచ్చిన పంట నేలకొరిగింది. మండలంలోని 11632 ఎకరాల్లో ఖరీఫ్ వరిపంట వేయగా ఇప్పటికే 2970 ఎకరాల్లో పంటను కోశారు. 512 ఎకరాల్లో పంట పనలపై ఉండగా మిగిలిన 8 వేల ఎకరాల్లో కోత కోయాల్సి ఉంది. ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం, పి.అగ్రహారం, తొండంగి, గోపాలపట్నం, పి.ఇ.చిన్నాయపాలెం, కృష్ణాపురం తదితర ప్రాంతాల్లో వ్యవసాయ శాఖాధికారి ఎస్.నరసింహం, తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం పర్యటించి పంటలను పరిశీలించారు. 130 ఎకరాల్లో వరిపంట నేలకొరిగిందని, మరో 512 ఎకరాల్లో పంట పనలపై తడిసిందని ఏఓ నరసింహం తెలిపారు.



బెండపూడిలో పనలపై తడిసిన వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ నరసింహం



కాట్రావులపల్లిలో ధాన్యం రాసులపై కప్పిన టార్పాలిన్లు

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తుని రూరల్: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో మండలంలో ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని తహసీల్దార్ ఎల్.శివకుమార్ తెలిపారు. సోమవారం తన కార్యాలయం నుంచి గ్రామాల్లో తుపాన్ ప్రభావంపై వీఆర్వోలను ఆయన ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో వర్షం కురుస్తోందన్నారు. ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదన్నారు. గ్రామీణ ప్రజలకు అత్యవసర సాయం అందించేందుకు రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు 98499 03887 నంబరుకు ఫోన్ చేసి అత్యవసర సహాయం పొందవచ్చన్నారు. వీఆర్వోలకు షిఫ్టుల వారీగా విధులు కేటాయించామని తెలిపారు.

ఐక్య గ్రాండ్ క్రిస్మస్ వాయిదా

గోకవరం: గోకవరంలో సోమవారం నిర్వహించ తలపెట్టిన నియోజకవర్గ ఐక్య గ్రాండ్ క్రిస్మస్ మిచాంగ్ తుపాను కారణంగా వాయిదా పడింది. తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండగా క్రిస్మస్‌ను ఆదివారం నిర్వహించనున్నట్టు పాస్టర్ ఫెలోషిప్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నబాబు తెలిపారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత



కాకినాడ జీజీహెచ్‌లో వెంకటరమణకు పింఛను అందజేస్తున్న వలంటీర్ స్రవంతి

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి, మల్లిశాల గ్రామాలకు చెందిన ఇద్దరు వృద్దులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా గ్రామ వలంటీర్లు సోమవారం కాకినాడ ఆసుపత్రికి వెళ్లి పింఛన్లు అందజేశారు. వివరాల్లోకి వెళితే.. కాట్రావులపల్లి గ్రామానికి చెందిన కె.అచ్చియ్యమ్మ అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న సచివాలయం-1 వలంటీర్ పైలా రవిరాజు కాకినాడ ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేశారు. మల్లిశాల గ్రామానికి చెందిన కట్టా వెంకటరమణ చేతికి గాయమై కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. అతనికి గ్రామ సచివాలయం-2 వలంటీర్ అడపా స్రవంతి కాకినాడ వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. సేవాభావంతో మానవత్వం చాటుకున్న వలంటీర్లను జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం అభినందించారు.

హరహర మహాదేవ

- భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



ఏలేశ్వరం శివాలయంలో ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఏలేశ్వరం: కార్తిక మాసంలో మూడో సోమవారం కావడంతో శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. నియోజకవర్గ వ్యాప్తంగా శైవ క్షేత్రాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఏలేశ్వరంలోని రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరాస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు శేఖర్, మహేష్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని లింగంపర్తి, సిరిపురం గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో నిండిపోయాయి. ఆలయాల్లోని ధ్వజస్తంభాల వద్ద మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

శివనామస్మరణతో మార్మోగిన నందనవనం

రౌతులపూడి: శృంగవరం-మెరక చామవరం రోడ్డులో నందనవనంలోని ఉమావర్ధినీ సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయం సోమవారం శివనామ్మస్మరణతో మర్మోగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు చెరువులు, కాలువలు, కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కుటంబ సమేతంగా ఆలయానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. పండితులు స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన వెంకటకృష్ణారెడ్డి, దుర్గామల్లేశ్వరి దంపతుల ఆర్థిక సాయంతో అన్నసమారాధన నిర్వహించారు. రౌతులపూడిలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

గండేపల్లి: కార్తికమాసంలో మూడో సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తాళ్లూరులో రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కిటకిటలాడిన శైవక్షేత్రాలు

ప్రత్తిపాడు: మండలంలోని శైవక్షేత్రాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు క్యూ కట్టారు. గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. చెరువుల్లో కార్తిక దీపాలను వదిలిపెట్టారు. రావి చెట్టు, జమ్మి చెట్టుల వద్ద పూజలు చేశారు. ప్రత్తిపాడులోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారి పంచాయతన క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. మహిళలు ధ్వజస్తభవం, సాయి మందిరం, దుర్గమాత ఆలయం, స్థానిక అభయ ఆంజనేయస్వామి ఆలయం, వేణు గోపాలస్వామి ఆలయాల్లో దీపారాధన చేశారు. స్థానిక శివాలయంలో ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక నరేంద్రగిరి సమీపంలోని పుష్కర కాలువలో మహిళలు దీపాలను వదిలిపెట్టారు. మండలంలోని ఏలూరు, పెదశంకర్లపూడి గ్రామాల్లో నగర సంకీర్తన నిర్వహించారు.

శివాలయాలకు భక్తుల తాకిడి

గోకవరం: కార్తిక మాసంలో మూడో సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తిక దీపాలు వెలిగించారు. స్థానిక రమాసత్యనారాయణస్వామి ఆలయంలో కొలువైన ఉమా సమేత గోకర్ణేశ్వరస్వామి, కొత్తపల్లిలో రెడ్డిరాజుల కాలం నాటి రాజలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అరుణాచలేశ్వరస్వామికి లక్ష పుష్పార్చన

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి శ్రీరమణా సేవాశ్రమంలో వేంచేసిన అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి వారికి సోమవారం లక్ష పుష్పార్చన నిర్వహించారు. పండితులు స్వామి వారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగాణంలో భారీ అన్నదానం నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఏర్పాట్లను శ్రీరమణా సేవాశ్రమ వ్యవస్థాపకుడు స్వామి రామానంద పర్యవేక్షించారు.

కిక్కిరిసిన రత్నగిరి

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం సోమవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. సత్యదీక్షలు ముగింపు సందర్భంగా దీక్ష విరమణకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన సత్యదీక్ష స్వాములతో పాటు సాధారణ భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. తుపాన్‌ను కూడా లెక్క చేయకుండా భక్తులు రత్నగిరికి తరలివచ్చారు.



తాళ్లూరులో రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ



నందనవనం నాగలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామికి లక్ష పుష్పార్చన చేస్తున్న పండితుడు



రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో భక్తుల రద్దీ